# గురుదక్షిణ




**చిలుకూరి దేవపుత్ర**

పొద్దు మునిగిపోయింది...

చీకట్లు ఇంకా ముసురుకోలేదు...

రైలు బోగీ కిటికీలో నించీ పడమటి ఆకాశం ఎరుపెక్కి ఉండటమూ, దూరంగా నల్లని కొండలు రైలు పోతున్న దిక్కుకే కదులుతూ ఉండటమూ, కొద్దిదూరంలో ఉన్న పచ్చటి పొలాల మధ్యగా పల్లెవాళ్ళు నెత్తిన పచ్చగడ్డి మోపులతో ఊరి దిశగా పోతూ ఉండటమూ గమనిస్తూ ఉన్నాను.

మా రైలు ఒరిస్సాలోని రాయగడ్ స్టేషను దాటి అరగంట అయింది. రాత్రి ఏ తొమ్మిదింటికో, పదింటికో కానీ సంబల్పూర్ చేరుకోలేను. ఆ ఊర్లోనే నా చిన్న కొడుకు గౌరీనాథశాస్త్రి బ్యాంకు ఆఫీసరుగా పనిచేస్తూ వున్నాడు. వాడిని చూసి రావడానికే ఈ ప్రయాణం. సంబల్పూర్ నాకు కొత్త కాబట్టి స్టేషనుకే రమ్మని వాడికి వారం కిందటే జాబురాశాను.

కొద్దిదూరంలో కూచున్న ప్రయాణికులు ఒరియా భాషలో ఒకటే మాట్లాడేస్తూ వున్నారు.

మధ్యాహ్నం భోజనం చేయకపోవడం వల్లనేమో ఈ వేళకే ఆకలి దంచేస్తోంది. అసలు ఏ ముహూర్తాన అనంతపురంలో రైలెక్కానో కానీ అన్నీ ఇబ్బందులే ఎదురవుతూ ఉన్నాయి. నాకు వృద్ధాప్యంతో పాటు చెక్కెరవ్యాధీ వచ్చేసింది. అందువల్ల ఆకలికి తట్టుకోలేనని నాకెంతో ఇష్టమైన చెక్కిలాలు పొట్లాంగా కట్టించి పెట్టింది నా పెద్దకోడలు. రైల్లో డబ్బుకు ఇబ్బంది పడకూడదని ఆరువందల రూపాయలు ఇచ్చాడు - మాపెద్దోడు చంద్రశేఖర శాస్త్రి అయితే రాజమండ్రి స్టేషను దాటుతూ ఉన్నట్టే చిన్న కునుకు తీశాను- అంతే నా పక్కనే ఉన్న సూట్ కేసు ఎవరో కొట్టేశారు. అందులోనే డబ్బూ, చెక్కిలాలు ఉన్నాయి. చిరుతిళ్ళు ఏమైనా కొనుక్కుతిందామన్నా నా జేబులో అయిదు రూపాయల నోటు మినహా ఇంకేం లేదు.

ఆకలి చూస్తే బ్రహ్మాండంగా అవుతోంది. నాకు ఎదురుగా కూచున్న దంపతులు చూడముచ్చటగా ఉన్నారు. వాళ్ళిద్దరూ రాయగడ్ స్టేషన్లో ఎక్కారు. అతనికి ముప్పయి అయిదూ, ఆమెకి ముప్పయి ఏళ్ళుంటాయి. మన రాష్ట్రం వాళ్ళే అయ్యుంటారు - తెలుగులోనే మాట్లాడుకుంటున్నారు. ఎందుకో అతను మాటిమాటికీ నన్నే చూస్తున్నాడు.

ఉన్నట్టుండి-" సార్! మీది అనంతపురం కదా?" అన్నాడు.

"అవునండీ!... మీరూ?!" అడిగాను.

"నాదీ అనంతపురమే సార్! నా పేరు రాజారెడ్డి... మీరు నన్ను గుర్తు పట్టినారో లేదో... నేను మీ శిష్యుణ్ణి సార్! సెవెంత్ క్లాస్‌లో మీరు తెలుగుకి వచ్చేవాళ్ళు. అంతసేపటి నించీ మీరా, కాదా, అని ఆలోచిస్తా వున్నాను. ఇప్పుడు ఎక్కడ సార్, వుండేది అనంతపురంలోనేనా?" అడిగాడు నవ్వుతూ.

నేను రిటైర్డ్ అయి ఏడేళ్ళయిందనీ, నివాసం మాత్రం అనంతపురంలోనేనని చెప్పాను అతనికి.

రాజారెడ్డి నాగురించీ, నేను పాఠాలు చెప్పే తీరు గురించీ వాళ్ళావిడతో చెప్తూ వున్నాడు. నా జ్ఞాపకాల పొరల్లో రాజారెడ్డి చిన్నప్పటి రూపం కోసం వెదికాను. దాదాపు ఇరవైమూడేళ్ళ క్రితం మాట... ఊహూ! లాభం లేదు. అయినా ఎక్కడో వున్న ఒరిస్సా రాష్ట్రంలో ప్రయాణిస్తున్న నాకు, ఎంతో ఆత్మీయంగా పలుకరించే శిష్యుడు దొరకడం ఎంత ఆనందం!

రాజారెడ్డితో మాట్లాడిన కాసేపట్లోనే అతని గురించి చెప్పాడు. అతను ఎం.ఎ., పూర్తి చేస్తున్నట్టే రైల్వే శాఖలో ఉద్యోగం వచ్చిందని, ఆరు నెలల క్రితం ప్రమోషను మీద రాయగఢ్‌కు వచ్చాడని తెలిపాడు. చాలాసేపు అతనితో పిచ్చాపాటీ మాట్లాడుతూ ఉండిపోయాను. నా ఆకలి మాత్రం నామీద ప్రతిక్షణం యుద్ధం ప్రకటిస్తూనే ఉంది.

ఈలోగా రాజారెడ్డి భార్య ప్లాస్టిక్ బుట్టలోంచి రెండు పొట్లాలు బయటకు తీసి విప్పసాగింది. ఆ పొట్లాల్లో ఉన్నది పులిహోరా అన్నది నా ముక్కు ఇట్టే గ్రహించేసింది.

నోరు వూరడం ప్రారంభమైంది నాకు.

ఏమైంది నాకూ?

శుచీ, శుభ్రం, అంటూ, ముట్టూ ఇవన్నీ ఏమయినట్లూ?

ఆకలి పెనుభూతం ముందు అవన్నీ తుడిచి పెట్టుకుపోతాయా?

రాజారెడ్డి నా శిష్యుడే కాబట్టి, వాళ్ళ భోజనంలో నాకూ భాగమివ్వకుండా పోడు అన్న ధీమా నాలో ఎక్కడో కలుగుతోంది. అతను తొందరగాతినమంటే బాగుండు...

"సార్! మీరు ఏమీ అనుకోకుండా వుంటే మేం భోంచేస్తాం! మీరు ఈ వేళకే తినరనుకుంటా.." అన్నాడు రాజారెడ్డి.

అతను ఎందుకట్లా అనుకుంటున్నాడు? ఎట్లా అనుకున్నా అతను మాత్రం నాకు భోజనం పెట్టకుండా చాలా తెలివిగా తప్పించుకుంటున్నట్లు అనిపించింది.

"అవునవును నేను ఈ వేళకే తిననయ్యా! మరి మీరేంది అప్పుడే..." అన్నాను.

"ఏం లేదు సార్! అర్ధగంటలో మేము దిగాల్సిన స్టేషను వచ్చేస్తాది. అక్కడ దిగి చిన్న పని చూసుకొని ఫ్రెండు ఇంటికి పోవాల... భోజన విషయమై అతన్ని ఇబ్బంది పెట్టడమెందుకని ఇప్పుడే కానిస్తున్నాం" అనేసి తినడం మొదలు పెట్టాడు రాజారెడ్డి.

నాకు నోరు వూరడం ఆగడం లేదు

రాజారెడ్డి నా శిష్యుడే కాబట్టి, వాళ్ళ భోజనంలో నాకూ భాగమివ్వకుండా పోడు అన్న ధీమా నాలో ఎక్కడో కలుగుతోంది. అతను తొందరగా తినమంటే బాగుండు...

లోకాన్ని ఆవరించిన చీకట్లని కిటికీగుండా చూస్తూ వున్నాను. పులిహోరా కమ్మటి వాసన నా ఆకలిని మరింత అధికం చేస్తోంది.

'నాకూ కొంచెం పెట్టరా అన్నం, ఆకలితో నకనకలాడుతున్నాను' అంటూ అడిగేదా? ఛ ఛ ఎందుకింత అధ్వాన్నంగా ఆలోచిస్తున్నాను. పోనీ, ఓ యాభై రూపాయలు అప్పు అడిగి తీసుకుంటేనో... హిట్లాగర్ స్టేషనులో భోంచేయవచ్చు. సంబల్పూర్ పోయినాక 'ఎంఓ' చేస్తే సరి.

'ఊహూఁ' అడగలేను. ఇంత బతుకూ బతికి ఇంటెనకాల ఎందుకు చావడం?

రైలు ఆగింది...

అది ఏ స్టేషనో చూడాలన్న ఉత్సాహం ఏ మాత్రం లేదు నాలో.

రాజారెడ్డీ, అతని భార్య నమస్కరించి వెళ్ళిపోయారు.

రైలు మళ్ళీ కదిలింది....

మా వెనకాల వున్న సీట్లలో కూచున్న వాళ్ళు ఏవో పళ్ళు బేరమాడుతూ ఉన్నారు. అమ్మేవాడి గొంతు చాలా స్పష్టంగా వినిపిస్తూ ఉన్నది. ఈ రైలుబళ్ళలో వ్యాపారస్తులు చాలా తెలివిగా పళ్ళని రెట్టింపు ధరకి అమ్ముతుంటారు. నిజానికి వాళ్ళ దగ్గర పళ్ళు కొనడం నాకైతే చిరాకే. అయితే ఏదో ఒకటి కొనుక్కు తినాల్సిందే- తప్పదు. అమ్మేవాడు హిందీలో గలగలమంటూ ఏదో మాట్లేడుస్తూ ఉన్నాడు. నాకు వచ్చే హిందీ అంతంతమాత్రమే - ఎట్లా బేరమాడాలో ఏమిటో...

నా పక్కనే కూచున్న మనిషి - 'ఇట్లా రావయ్యా!' అంటూ కేకేశాడు పళ్ళు అమ్మే మనిషిని -హిందీలో.

అతను వచ్చాడు. సన్నగా, నల్లగా వున్నాడు. కొంచెం మాసిన గడ్డం... చురుకైన కళ్ళూ... చక్కనైన పలువరసతో నవ్వుతూ మాట్లాడ్డం... చూస్తుంటే నాకు ఇష్టంగా అనిపించి అట్లా చూస్తూ ఉండిపోయినాను. ఆ మనిషి చేతిలో జామ పళ్ళు ఉన్నాయి. నా అదృష్టం - షుగర్ పేషంట్లు ఆ పళ్ళు తినవచ్చు! పక్కనున్న మనిషి కొన్న దాని బట్టి కొంటే సరి అనుకుని ఊరికే చూస్తూ ఉన్నాను.

నా పక్కన మనిషికి బేరం కుదరలేదు...

ఈలోగా మా ముందు వైపు సందులో కూచున్న వాళ్ళు పిలిస్తే వెళ్ళి పోయాడు బుట్టతో పాటూ- పోతూ పోతూ అతను నన్ను ఒకసారి చూసి, నవ్వి వెళ్ళడం నాకు వింతగా అనిపించింది.

అతనట్లా ఎందుకు నవ్వాడో-

నా చేతిలో ఉన్న అయిదు రూపాయల నోటుని చూశా?

కొందామా వద్దా అన్న మీమాంసతో నేను ఉండటం చూశా?

లేదూ- ఇంతకు మునుపు నన్ను ఎక్కడయినా చూశాడనా?

నాకు అతను కనబడటం లేదు గాని అతని గొంతు మాత్రం వినిపిస్తూ ఉంది.

ఆశ్చర్యం... అతను తెలుగులో మాట్లాడుతున్నాడు...

"ఏంటయా బాబూ! అల్లా అడుగుతా రేంటి... ఇయి అట్టాంటి ఇట్టాంటి పళ్ళు కాదండీ..." అంటున్నాడు.

అంటే అతను తెలుగవాడేనన్నమాట! లేకుంటే అంతబాగా కోస్తాయాసలో ఎట్లా మాట్లాడగలడు!

పది నిమిషాల్లో అతని గొంతులోంచి బెంగాలీ, అస్సామీ, అరవం కూడా వినిపించాయి.

బూడిద రంగు యూనిఫాంలో ఉన్న యువకుడు ఉన్నట్టుండి ప్రత్యక్షమైనాడు. చేతిలో ఏదో పుస్తకం ఉంది. 'భోజనం కావాలా?' అంటూ అందర్నీ హిందీలో అడుగుతున్నాడు.

నా పక్కనున్న మనిషి నా వైపు చూసి "వచ్చే స్టేషన్‌లోనే భోజనాలు వస్తాయి- ఆర్డరు ఇస్తారా?" అంటూ హిందీలో అడిగాడు.

వద్దంటూ తల ఊపాను.

ఆకలి మండిపోతూ ఉంది.

ఈ పళ్ళమ్మేవాడు వస్తే బాగుండు... మళ్ళీ ఇటువైపు రాడేమో, అట్లానే వెళ్ళిపోతేనో...

అట్లా అనుకోగానే - "ఇగ్గో - జాం పండ్లాయనా! ఇట్ట రావయ్యా!" అంటూ కేకపెట్టాను.

"ఆఁ వస్తుండాను సార్! రోంతసేపు ఉండండి... ఈడ అమ్మేది అయిపోతానే ఆటికే వచ్చేది!" అంటూ పళ్ళమ్మే వాడి గొంతు వినిపించింది.

ఆ మాటల్ని అతిమామూలుగానే విన్నాను కానీ, ఆ మాటల్లోని అనంతపురం జిల్లా యాస మెల్లగా బోధపడింది.

మొత్తానికి ఈ మనిషి అసాధ్యుడే! ఈ బోగీలో ఎన్ని రకాల భాషల వాళ్ళుంటే వాళ్ళందరితోనూ అన్ని రకాల భాషలు మాట్లాడడమే కాకుండా, తెలుగు వాళ్ళతో వాళ్ళ వాళ్ళ యాసల్లో కూడా మాట్లాడుతున్నాడు. ఇతనే చదువుకుని ఉంటేనా ఎంత గొప్ప ప్రజ్ఞావంతుడయి ఉండేవాడో! ఇన్ని భాషల మీద పట్టు సంపాదించడమంటే మాటలా?

"సార్! వచ్చేస్తిని- యా పండ్లు కావల్నో చెప్పండి సార్! మీరే ఏరుకుంటారా లేకుంటే నన్నే ఏరి ఇమ్మంటారా?" అడిగాడు పళ్ళమ్మే మనిషి- నవ్వుతూ.

"నువ్వే ఏరి ఇయ్యప్పా!" అన్నాను అతన్ని ముచ్చటగా చూస్తూ అతను బుట్టలో మంచి పండ్లు ఏరుతూ వుంటే-

"అది సరే గానీ ఒక్కమాట చెప్పయ్యా! ఇన్ని రకాల భాషలు ఎట్లా నేర్చుకుండావు నువ్వు! నిన్ను చూసిన ఈ రోంతసేపటికే చానా అబ్బురపడతా వుండాను నేను" అన్నాను.

"నాకి యా భాష అయినా నేర్పిందేది నా బతుకు తెరువే సార్! అదే నాకి గురువు ఉన్నెట్ల." అన్నాడతను, పండ్లు ఏరడం ఆపి

"ఇన్ని భాషలు మాట్లాడినావే నీ సొంతభాష ఏదయ్యా!" అనడిగాను... అతనితో మాట్లాడుతూ వుంటే ఎందుకో ఉత్సాహంగా వుంది.

"యాల వచ్చింది సార్! మీకి అనుమానము- తెలుగోడు తప్పా ఇంత బాగా అన్ని భాషలూ, యాసలూ ఎవుడు మాట్లాడుతాడు సార్!"

"నాకి మరీ ఆశ్చర్యమనిపించింది ఏందంటే నువ్వు మా యాసలో మాట్లాడితివే- అది. అబ్బ, నిజ్జంగా నన్ను మురిపించిందప్పా!"

"అంతమాత్రానికే ఆశ్చర్యపోతే ఎట్లసార్! అయితే మిమ్మల్ని ఇంగా ఆశ్చర్యపర్చాల్సిందే" అన్నాడతను నా కళ్ళలోకి చూస్తూ.

నిజంగా అతను అన్నంతపని చేయగల చతురుడే అనిపించింది. మంచి జామపండ్లని ఏరి అతని చేతిలోనే ఉంచుకున్నాడే కాని, నా చేతికి ఇవ్వలేదు.

"మీది అనంతపురం సార్!" అన్నాడు సూటిగా చూస్తూ.

"అవునూ" అన్నాను కొంచెం ఆశ్చర్యపోతూ.

"మీరు అయ్యవారిగా పనిచేసి రిటైర్డు అయినారు" అన్నాడు.

అవునన్నట్టు తల ఊపాను మరింత ఆశ్చర్యపోతూ.

"మీరు మీ చిన్న కొడుకు దగ్గరికి పోతా వుండారు. మీ చిన్న కొడుకు పేరు గౌరీనాథశాస్త్రి... మీ డబ్బు ఎవరో కొట్టేశారు. అందుకే ఆకలితోనే ప్రయాణం చేస్తావున్నారు" అంటూ అతను చెబుతూ వుంటే ఈ మనిషకి టెలిపతిలాంటి విద్య ఏదయినా వచ్చునేమె లేకపోతే ఇంత కచ్చితంగా చెప్తున్నాడు. ఆ మాటే అన్నాను ఆశ్చర్యంలో మునకలేస్తూ.

మాల మాదిగల పిల్లోల్లకి దప్పికయితే సిలవారి చెంబుతో దోసిట్లోకి నీళ్ళు ఎత్తి పోసేవాళ్ళు. ఒకనాడు నాకయితే బొలే దప్పికయితా వుంది. నాలిక పిడసగట్టుకోని పోతా వుంది. నా దోసిట్లోకి నీళ్ళు పోసేకి రమ్మంటే పిల్లోల్లు ఎవురూ రాలే...

"నాకి యా టెలిపతీ రాదు సార్! మిమ్మల్ని అబ్బురపరిచేదానికి ఇవన్నీ మాట్లాడినాను. రాజమండ్రి నించీ మీతోపాటీ ప్రయాణం చేసి అప్పలసామి నాకు బాగా పరిచయమే సార్! అతను దిగిపోతూ మీ గురించి చెప్పి, మీ ఊరి మనిషేనండీ పళ్ళయినా ఇవ్వు' అన్నాడు. తీరా జూస్తే ఎవురో కాదు మీరే' అన్నాడతను.

"ఏందీ ఫీదీ అనంతపురమేనా?" అన్నాను ఆత్రంగా "అనంతపురం టౌను కాదు సార్! అదే జిల్లాలో వుండే కాలువపల్లి మా వూరు"

"ఏందీ కాలువపల్లా! ఆ వూర్లో నేను టీచరుగా పనిజేసినానప్పా!" అన్నాను ఆనందాశ్చర్యాలతో...

"తెలుసుసార్! మీరు నాకి గురువు కూడా!"

"అరెరే, అట్లనా! నువ్వు నా శిష్యునివా... ఎప్పుడూ? అసలు నీ పేరు ఏందయ్యా!" అనడిగాను, అతన్ని... చిన్నప్పుడు అతన్ని చూసిన జ్ఞాపకముందేమోనని గుర్తు చేసుకుంటున్నా.

"నా పేరు నల్లప్ప సార్! మిగతా సుద్దులన్నీ ఆనెంక జెప్తాను గానీ ముందు ఈ పండ్లు తీసుకోండి... దుడ్లు ఏమొద్దు" అన్నాడు మూడు పెద్ద పెద్ద జాంపండ్లని నా ఒళ్ళో పెడుతూ.

నా దగ్గరున్న అయిదు రూపాయల్ని ఎంత బతిమాలినా తీసుకోలేదు నల్లప్ప.

చుట్టుపక్కల కూచున్న ప్రయాణికులకి మా ఇద్దరి మాటలు అర్థం కాక వింతగా చూస్తూ ఉన్నారు.

నా పక్కనున్నతను ఉండబట్టలేక నల్లప్పని హిందీలో అడిగాడు- 'అసలు విషయమేమిట'ని.

చెప్పాడు నల్లప్ప. పైగా తన గురువుకి గురుదక్షిణగా జామపండ్లు ఇచ్చానని చెబుతున్నాడు.

ఆ మనిషి 'అచ్ఛా అచ్ఛా' అంటూ సమాధాన పడ్డాడు.

నాకయితే నల్లప్ప చిన్నప్పటి రూపం గుర్తురావడంలేదు.

ఆమాటే అన్నాను నల్లప్పతో-

"నేను వెట్టి ఎల్లప్ప కొడుకుని సార్! మా దిగోణ్ణి... మీరు జూస్తే మడీ, ఆచారమూ వుండే బేమ్మర్లు... అప్పట్లో మీరు చానా కోపిష్టులు. సన్న తప్పుజేసినా మమ్మల్ని చింత బర్రతో వాయించి పారేస్తా వుంటిరి. అప్పుడు గూడా ఇట్లే ఎండలకాలం. బడిలో పిల్లలంతా తాగేకి మంచినీళ్ళబానని కొత్తగా తెచ్చినారు. మాల మాదిగల పిల్లోల్లకి దప్పికయితే సిలవారి చెంబుతో దోసిట్లోకి నీళ్ళు ఎత్తి పోసేవాళ్ళు. ఒకనాడు నాకయితే బొలే దప్పికయితా వుంది. నాలిక పిడసగట్టుకోని పోతా వుంది. నా దోసిట్లోకి నీళ్ళు పోసేకి రమ్మంటే పిల్లోల్లు ఎవురూ రాలే... ఇంగేమి జేసేది. నేనే ధయిర్నెంగా పోయి చెంబుతో బానలో నీళ్ళు ముంచుకోని గుటగుట ఎత్తికొడితి. అప్పుడు నాకు నిమ్మళమయింది. అయితే నేను సొంతంగా నీళ్ళు చెంబుతో తాగిండేది మీ కంట్లో పడింది. ఇంగేముంది చింతబర్రతో నన్ని తుక్కు రేగేదట్ల కొట్టినారు. మిగతా అయ్యవార్లు గూడా నన్ని తలా రెండేట్లు ఏసినారు. ఏమంటే నేను ఆడనే సచ్చిపోతానేమోనని ఊరికే అయిపోయినారు. అంతే మళ్ళా బళ్ళోకి అడుగు పెట్టల్లంటే బయము. అందుకే బడికి మానుకొంటిని సార్! అనంతపురంలో మా మామ తాకి యిడిసె మా నాయిన- ఏదన్నా పని నేర్పమని. ఆకిరీకి ఈ పని అబ్బింది సార్!" అంటూ చెప్తావుండాడు నల్లప్ప.

ఏం మాట్లాడాలో తోచడం లేదు నాకు...

"సార్! మీకు భోజన టికెట్టు తీసుకుండాను ఇద్దో... వచ్చే స్టేషనులో భోంచెయ్యండి!" అన్నడు నవ్వుతూనే.

ఇంకెక్కడి ఆకలి!!!

యాంత్రికంగా టికెట్టు అందుకున్నాను.

రైలు ఆగింది...

నాకు చివరి సారిగా నమస్కరించేసి పళ్ళ బుట్టతో పాటూ వెళ్ళిపోయినాడు నల్లప్ప.

నా ఒళ్ళో జామపండ్లూ... నా చేతిలో భోజనం టికెట్టూ... కడుపులో ఆకలి ఎప్పుడో మాయమైపోయింది... నల్లప్ప వెళ్ళిన వైపే చూస్తూ వుండి పోయినాను... కళ్ళలో నిండిన నీళ్ళతో... ●






3